సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 26 । జూలై । 2024



వరద ముంపులోనే పొలాలు
వారం క్రితం కురిసిన భారీ వర్షంతో ఉగ్రరూపం దాల్చిన పెద్దవాగు వరద ముంపు ప్రభావం నుంచి రైతులు ఇంకా తేరుకోలేదు. IIలో



సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
గోదావరి వరదల నేపథ్యంలో లోతట్టు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆర్డీఓ సూచించారు. IIలో



వాతావరణం
జిల్లాలో శుక్రవారం వాతావరణం చల్లగా ఉంటుంది. కొన్ని చోట్ల సాయంత్రం తర్వాత ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ డీ.ఆర్.అభిషేక్‌గౌడ్ దర్శించుకున్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచ: మండంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య వెలసిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన చేశారు. అనంతరం అర్చకులు అమ్మవారికి హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ రజినీకుమారి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆలయంలోని షాపులు, తలనీలాలు, చీరలకు లైసెన్స్, పూలు, పూలదండల అమ్మకాలకు సంబంధించి ఈనెల 27న ఉదయం 10.30 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. టెండర్‌లో పాల్గొనే వారు రూ.200 చెల్లించి షెడ్యూల్ పొందాలని సూచించారు.

పాదాభిషేకంతో కృతజ్ఞతలు
స్వీపర్ కాళ్లు కడిగిన ఎంపీపీ దంపతులు



స్వీపర్ కుమారి కాళ్లు కడుగుతున్న ఎంపీపీ శ్రీరామ్మూర్తి దంపతులు

అశ్వారావుపేటరూరల్: పదవిలో ఉన్నన్నాళ్లు సేవ చేసిన స్వీపర్ కాళ్లు కడిగిన ఎంపీపీ కృతజ్ఞతలు తెలిపారు. అశ్వారావుపేట ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి పదవీకాలంలో త్వరలో ముగియనుంది. ఈ నేపథ్యాన మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ ముందస్తు పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీరామ్మూర్తి దంపతులు కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న కుమారి కాళ్లు కడిగి సన్మానించారు. అతర్వాత ఎంపీపీని అధికారులు, ఎంపీటీసీలు, ఆర్య వైశ్య సంఘం, బీఆర్‌ఎస్ నాయకులు సన్మానించి ఆయన చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస రావు, తహసీల్దార్ కృష్ణప్రసాద్, జెడ్పీటీసీ చిన్నంశెట్టి వరలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే పాషా, నాయకులు పాల్గొన్నారు.

సీతారామకు ఊతం



సీతారామ ప్రాజెక్ట్ పనులు చేపడుతున్న దృశ్యం (ఫైల్)

భట్టి పద్దులో ఈ ప్రాజెక్ట్‌కు రూ.799 కోట్లు
- ఆయిల్‌పామ్ సాగుకూ ప్రోత్సాహకాలు
- కొత్త పంచాయతీలకు నూతన భవనాలు
- అర్ధంతరంగా ఆగిన 'డబుల్' ఇళ్లలో కదలిక
- పంప్డ్ స్టోరేజ్ హైడల్ ప్రాజెక్టులకు నిధులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ప్రవేశపెట్టిన 2024–25 బడ్జెట్‌లో సీతారామ ప్రాజెక్టుకు రూ.799 కోట్లు కేటాయించారు. ఇందులో పంప్‌హౌస్‌లు, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల తదితర పనుల కోసం రూ. 687 కోట్లు కేటాయించగా.. సీతమ్మసాగర్ బ్యారేజీ, దాని అనుబంధ పనుల కోసం రూ.111 కోట్లు బడ్జెట్ పద్దుగా డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క చూపించారు. ఎనిమిదేళ్ల క్రితం సీతారామ ప్రాజెక్టు పనులు ప్రారంభం కాగా ఇప్పటి వరకు రూ.8వేల కోట్లు ఖర్చయ్యాయి. అయినా ఒక్క ఎకరాకు కూడా నీరందలేదు. దీంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో సీతారామ ద్వారా కనీసం 1.50 లక్షల ఎకరాల నాగార్జున సాగర్ ఆయకట్టుకు నీరందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో ఈ బడ్జెట్‌లో కేటాయించిన నిధులను సీతారామ ద్వారా అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు వినియోగించనున్నారు. మరోవైపు సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణ పనులపై న్యాయపరమైన అడ్డంకులు ఉండగా, పర్యావరణ అనుమతులు కూడా రాలేదు. దీంతో ఈ బడ్జెట్‌లో బ్యారేజీ నిర్మాణ పనులకు భారీగా నిధులు కేటాయించలేదు. బ్యారేజీతో పాటు 320 మెగావాట్ల జలవిద్యుత్ కేంద్రాన్ని నిర్మించాల్సి ఉంది. ఈ బ్యారేజీ నిర్మించే వరకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న కాటన్ ఆనకట్ట ద్వారా నీటిని ఎత్తిపోయాలనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది.

పామాయిల్‌కు ప్రోత్సాహం..

పామాయిల్ సాగుకు అవసరమైన ప్రోత్సాహకాలు అందించేందుకు ఈ బడ్జెట్‌లో మొగ్గు చూపారు. జిల్లాలో ఇప్పటికే 65 వేల ఎకరాల్లో పామాయిల్ సాగవుతోంది. ఈ ఏడాది మరో పది వేల ఎకరాల్లో పంట వేసేందుకు రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించినందున వీరికి రాయితీపై విత్తనాలు, డ్రిప్ పరికరాలు సకాలంలో అందనున్నాయి. ఎకో టూరిజంలో భాగంగా కిన్నెరసానిని అభివృద్ధి చేస్తామంటూ ప్రకటించారు. అయితే వెన్నెల జలపాతం, రథంగుట్ట(మణుగూరు)కు ఈ బడ్జెట్‌లో చోటు దక్కలేదు.

కొత్త జీపీలకు భవనాలు..

కొత్తగా ఏర్పాటైన పంచాయతీలకు భవనాలు నిర్మిస్తామని బడ్జెట్ ప్రసంగం లో భట్టి పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో 481 పంచాయతీలు ఉండగా.. వీటిలో 286 పంచాయతీలకు సొంత భవనాలు లేవు. బడ్జెట్‌లో నిధులు కేటాయించినందున త్వరలోనే సొంత భవనాలు అందుబాటులోకి రానున్నాయి. సోషియో ఎకానమీ సర్వే ప్రకారం జిల్లాలో 64 శాతం ప్రాంతానికే రోడ్ నెట్‌వర్క్ ఉన్నట్టుగా తేలింది. ప్రస్తుత బడ్జెట్‌లో ప్రతీ గ్రామం, ప్రతీ ఇంటికి మెరుగైన రోడ్ కనెక్టివిటీ ఇస్తామని పేర్కొనడం జిల్లాకు శుభసూచకం. అలాగే జిల్లాలో మిషన్ భగీరథ నీళ్లు అందని ఇళ్లు 15వేల వరకు ఉండగా 25 గ్రామాలు ఉన్నాయి. వీటన్నింటికీ ఈ ఆర్థిక సంవత్సరం గడిచేలోగా పరిశుభ్రమైన తాగు నీరు అందుబాటులోకి రానుంది. ప్రతీ నియోజవర్గానికి 3,500 వంతున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్టు బడ్జెట్‌లో పేర్కొన్నారు. అర్ధంతరంగా ఆగిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమస్యను ఓ కొలిక్కి తెచ్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పడంతో గతంలో లబ్ధిదారులుగా ఎన్నికైన వారికి ఉపశమనం కలగనుంది.

పారిశ్రామిక పార్కులతో..

ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళల్లో నైపుణ్యాలను వృద్ధి చేసి ప్రతీ నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ తరహా పార్కును ఇల్లెందు నియోజకవర్గంలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరిగినా కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం బడ్జెట్‌లో ప్రకటించిన విధానం అమల్లోకి వస్తే జిల్లాకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

ఎనర్జీ సెక్టార్‌లో..

కాలుష్య రహిత విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి కొత్త ఎనర్జీ పాలసీ రూపొందిస్తామని భట్టి పేర్కొన్నారు. ప్రస్తుం జిల్లాలో సింగరేణి ఆధ్వర్యంలో కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరులో సోలార్ విద్యుత్ కేంద్రాలు ఉన్నాయి. ప్రయోగాత్మకంగా ఇల్లెందులో పంప్‌డ్ స్టోరేజీ హైడల్ విద్యుత్ ప్రాజెక్టును పట్టాలెక్కించబోతున్నారు. కొత్త ఎనర్జీ పాలసీ అమల్లోకి వస్తే జిల్లాలో మరిన్ని సోలార్, పంప్‌డ్ హైడల్ ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చే ఆస్కారం ఉంది.

ఈ మూడింటికి నిరాశే..



కిన్నెరసాని ప్రాజెక్టు

జిల్లాలో కిన్నెరసాని, తాలిపేరు, పెద్దవాగు మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులుగా ఉన్నాయి. ఈ బడ్జెట్‌లో ఈ మూడు ప్రాజెక్టులకు ఆశించిన స్థాయిలో నిధుల కేటాయింపు జరగలేదు. తాలిపేరుకు రూ. 54 లక్షలు, పెద్దవాగుకు 3 లక్షలు, కిన్నెరసానికి కేవలం రూ.లక్ష చొప్పున కేటాయించారు. ఇప్పటికే నిర్వహణ పరమైన లోపాలతో ఇటీవలి వర్షాలకు పెద్దవాగు ప్రాజెక్టు కొట్టుకుపోయింది.

పెదవాగుకు సత్వరమే మరమ్మతులు
- రూ.3.50 కోట్లతో సిద్ధమైన ప్రతిపాదనలు
- నిధుల విడుదలకు మంత్రి ఉత్తమ్ హామీ
- ప్రాజెక్టుపై మంత్రి తుమ్మల ఫోకస్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఈ వానాకాలం సీజన్‌లోనే రైతులకు సాగునీరు అందేలా యుద్ధప్రతిపాదికన పెదవాగు పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ ప్రాజెక్టు కొట్టుకుపోగా తాత్కాలిక మరమ్మతుల్లో భాగంగా బండ్ ఫార్మేషన్, అప్రోచ్ కెనాల్ పనులు కోసం రూ.3,50 కోట్లతో ఇరిగేషన్ అధికారులు అంచనాలు సిద్ధం చేశారు. ఈ నిధులు వెంటనే మంజూరు చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మంత్రి తుమ్మల కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.

నిధుల బాధ్యత నాది..

అతి భారీ వర్షం, వరదలతో పెదవాగు ప్రాజెక్ట్ ఆనకట్టకు గండ్లు పడగా అర టీఎంసీ నీరు ఖాళీ అయింది. ఈ సీజన్‌లోనే ప్రాజెక్ట్ ఆయకట్టు కింద పంటల సాగు కోసం తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. నిధులు మంజూరు చేయించే బాధ్యత తనదని, రైతులకు సాగు నీటి కష్టాలు రాకుండా చూడాలని అధికారులను సూచించారు. పెదవాగు ప్రాజెక్ట్ మరమ్మతు పనులకు నిధులు కేటాయించడంలో వెంటనే స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు.

ఆగస్టు 6, 7 తేదీల్లో 'ఎక్స్‌టర్నల్' పరీక్షలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం విడుదల చేసిన ఎక్స్‌టర్నల్ సెకండ్ నోటిఫికేషన్‌లోని ఏడు విభాగాల్లో 327 పోస్టులకు సంబంధించిన పరీక్షల షెడ్యూల్ గురువారం వెలువడింది. ఈ పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో వచ్చేనెల 6,7 తేదీల్లో నిర్వహించనున్నారు. తొలి రోజున అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రెయినీ (ఎలక్ట్రికల్) టీఅండ్ఎస్ గ్రేడ్ –సీ, జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రెయినీ, ఎలక్ట్రీషియన్ ట్రెయినీ కేటగిరీ– 1, ఫిట్టర్ కేటగిరీ –1 పరీక్షలు, రెండో రోజున మేనేజ్‌మెంట్ ట్రెయినీ (ఈఅండ్ఎం) ఈ –2 గ్రేడ్, మేనేజ్‌మెంట్ ట్రెయినీ (సిస్టమ్) ఈ–2 గ్రేడ్, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రెయినీ (మెకానికల్) టీఅండ్ఎస్ గ్రేడ్ – సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు సంస్థ అధికారులు వివరించారు. పరీక్ష సెంటర్లు, సమయం వంటి వివరాలను అడ్మిట్ కార్డ్‌లో పొందుపర్చనున్నట్లు పేర్కొన్నారు.

మొదటి ఎక్స్‌టర్నల్ పరీక్ష కీ విడుదల..

ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించిన మొదటి ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ పరీక్షల కీ పేపర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ కీ తో పాటు ఆన్సర్ షీట్‌ను కూడా అభ్యర్థుల మొబైల్ ఫోన్‌లకు పంపించారు. ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 27లోగా తెలపాలని సూచించారు. ఆ తర్వాత ఫలితాలు విడుదల చేస్తారని సమాచారం.

సంక్షేమం, వ్యవసాయానికి కేటాయింపులు సంతృప్తికరం

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమం, వ్యవసాయ శాఖకు కేటాయింపులు సంతృప్తికరంగా ఉన్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. గురువారం శాసనసభలో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆయన మాట్లాడుతూ.. సంక్షేమానికి రూ.40 వేల కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ. 72,669 కోట్లు కేటాయించడం హర్షణీయమని అన్నారు. అయితే మారిన పరిస్థితులకు అనుగుణంగా మరిన్ని నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుపోతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. సాగునీటి రంగానికి మరిన్ని నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గత పదేళ్లలో నిధులన్నీ కాళేశ్వరానికే మళ్లించడంతో అనేక ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయని, ఈ ప్రభుత్వమైనా వాటిని పూర్తి చేసేందుకు ముందుకు రావాలని సాబీర్‌పాషా కోరారు.

కేటాయింపులే కాదు.. ఆచరణ ఉండాలి

సింగరేణి(కొత్తగూడెం): బడ్జెట్‌లో అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రకటించినా నిధులు ఖర్చు చేయకుండా, అంకెలకే పరిమితమైతే ఉపయోగం ఉండదని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పేర్కొన్నారు. గత ప్రభుత్వం కంటే అధికంగా బడ్జెట్ ప్రకటించినా అచరణ కీలకమని అన్నారు. ఆర్థిక మంత్రి ప్రసంగంలో ఉపాధి కల్పన అంశంపై మాట్లాడలేదని, గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌కు సంబంధించి 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారే కానీ ఈ ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేస్తుందో వివరించలేదని ఆరోపించారు. నీటి పారుదల రంగానికి నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. భద్రాచలం అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా భద్రాచలం అభివృద్ధి, గోదావరి వరదల నుంచి ప్రజలను రక్షించే కరకట్ట నిర్మాణం వంటి విషయాలను ప్రస్తావించలేదన్నారు.

ఏసీబీ వలలో పాల్వంచ ఎస్సై
రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు





పట్టుబడిన ఎస్‌ఐ రాముతో ఏసీబీ డీఎస్పీ రమేష్ తదితరులు (ఇన్‌సెట్) ఎస్‌ఐ బి.రాము

పాల్వంచ: పాల్వంచ పట్టణ ఎస్సై బి.రాము రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. పాల్వంచకు చెందిన సీరపు శ్రావణి కొత్తగూడేనికి చెందిన బాలసాని అనురాధకు రూ.20 లక్షలు అప్పుగా ఇచ్చింది. ఆమె తిరిగి చెల్లించకపోవడంతో కొత్తగూడెంలోని అనురాధ ఇంటిని శ్రావణి కోర్టు ద్వారా అటాచ్‌మెంట్ చేసుకుంది. అయితే ఈ విషయంలో పాల్వంచకు చెందిన చావా శ్రీనివాస్ జోక్యం చేసుకుని సుమారు రూ.2 కోట్ల విలువైన ఇంటిని అనురాధకు తక్కువ ధర చెల్లించి తన కుమారుడు రుషీల్ చౌదరి పేరున కొనుగోలు చేశాడు. ఇదేమిటని శ్రావణి అనురాధను ప్రశ్నించగా ఆమెతో పాటు శ్రీనివాస్ తదితరులు బెదిరించగా బాధితురాలు మే 19వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. కానీ ఎస్సై రాము వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో న్యాయవాది లక్ష్మారెడ్డి సహకారంతో మే 22న ఎస్పీకి ఫిర్యాదు చేయడమే కాక కొత్తగూడెం కోర్టులో ప్రైవేటు కంప్లైంట్ ఫైల్ దాఖలు చేశారు. ఈక్రమంలో జడ్జి ఆదేశాలతో ఈనెల 3న ఎస్సై రాము శ్రీనివాస్ తదితరులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఆ తర్వాత వారిని అరెస్ట్ చేసి చార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు శ్రావణిని రూ.20 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ విషయాన్ని శ్రావణి న్యాయవాది దృష్టికి తీసుకెళ్లగా ఆయనతో మాట్లాడించినా ఎస్సై లంచం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశాడు. దీంతో ఏసీబీ అధికారులను సంప్రదించగా.. వారి సూచన మేరకు న్యాయవాది లక్ష్మారెడ్డి గురువారం ఎస్సై ఇంటికి వెళ్లి రూ.20 వేలు ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ సిబ్బందితో కలిసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు ఆయనపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే 1064 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచడంతో పాటు వారికి పూర్తి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. కాగా, ఇటీవల భద్రాచలం ఎస్‌ఐ శ్రీనివాస్ లంచం తీసుకుంటూ దొరికిన ఉదంతం మరువక ముందే మరో ఎస్‌ఐ పట్టుబడడం పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

భద్రాచలంటౌన్: మణుగూరు, మిట్టగూడెంలోని గిరిజన సంక్షేమ గురుకుల(బాలురు)డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

17 అడుగులకు చేరిన పాలేరు

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం గురువారానికి 17 అడుగులకు చేరింది. ఈనెల 20వ తేదీన సాగర్ నుండి నీటిని విడుదల చేయగా రిజర్వాయర్ నీటిమట్టం 5.5 అడుగుల నుండి 17 అడుగులకు పెరిగింది. కాగా, గురువారం ఉదయం సాగర్ నుండి నీటి సరఫరాను అధికారులు నిలిపేశారు. అయినా కాల్వలో ఉన్న 2,100 క్యూసెక్కుల మేర నీరు రిజర్వాయర్‌లోకి చేరుతోంది. ఈ నీరంతా పూర్తయ్యే సమయానికి నీటమట్టం 18అడుగులు దాటొచ్చని అధికారులు భావిస్తున్నారు. కాగా, 23 అడుగుల సామర్థ్యం కలిగిన పాలేరు కొద్దిరోజుల క్రితం డెడ్‌స్టోరేజీకి చేరగా.. ఇప్పుడు మళ్లీ 17 అడుగుల మేర నీటితో కళకళలాడుతోంది. తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకపోగా ఎగువ కురుస్తున్న వర్షాలతో సాగర్ నిండితే మళ్లీ సాగు అవసరాలకు విడుదల చేసే అవకాశముందని చెబుతున్నారు.

మళ్లీ పెరిగి'నది'
- దోబూచులాడుతున్న గోదావరి
- మరోసారి రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- అధికారులు అప్రమత్తంగా ఉండాలన్న కలెక్టర్



భద్రాచలం వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీ ముంపు ప్రజలను గోదావరి ముప్పుతిప్పలు పెడుతోంది. వారం రోజులుగా పెరుగుతూ.. తగ్గుతూ అయోమయానికి గురి చేస్తోంది. ఒక వైపు స్వల్పంగా తగ్గుతూ ఊరటనిస్తూనే మళ్లీ కొద్ది గంటల వ్యవధిలోనే పెరుగుతోంది. దీంతో ముంపు ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

తగ్గినట్టే తగ్గి..

బుధవారం రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించిన తర్వాత ఆ రాత్రే గోదావరి ప్రవాహం మళ్లీ పెరగడం ప్రారంభమైంది. తొలుత స్వల్పంగా, ఆ తర్వాత వేగంగా పెరిగి గురువారం ఉదయం 46.50 అడుగులకు చేరింది. స్వల్పంగా పెరుగుతూ మధ్యాహ్నం 1.10 గంటలకు 48 అడుగులకు చేరడంతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. కాగా, సాయంత్రం 4 గంటలకు 48.40 అడుగులకు చేరిన నీటిమట్టం.. అదే ప్రవాహంతో నిలకడగా ఉండి రాత్రి 8 గంటలకు తిరిగి తగ్గుముఖం పట్టింది. 8 గంటలకు 48.30 అడుగులకు చేరగా 11 గంటలకు 48.10 అడుగులుగా నమోదైంది.

రెండోసారి రెండో ప్రమాద హెచ్చరిక..

గోదావరికి ఎగువ భాగాన పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నదులు, ఉపనదులు పొంగడంతో భద్రాచలం వద్ద గోదావరి పెరిగింది. గత శనివారం మొదటి, ఆదివారం రెండో ప్రమాద హెచ్చరికల స్థాయికి నీటిమట్టం పెరగగా, ఆ తర్వాత క్రమంగా తగ్గడంతో బుధవారం రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఎగువ నుంచి మళ్లీ వరద రావడంతో క్రమంగా గోదావరి నీటి మట్టం పెరిగింది. దీంతో గురువారం మళ్లీ రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

అయోమయంలో ఏజెన్సీ ప్రజలు..

పది రోజులుగా గోదావరి పెరుగుతూ, తగ్గుతూ దోబోచులాడుతుండడంతో భద్రాచలం ఏజెన్సీలోని ముంపు గ్రామాల ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపాడు మండలాల్లోని కొన్ని గ్రామాల నడుమ రహదారిపైకి వరద నీరు చేరుతుండడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. భద్రాచలం నుంచి చర్ల, వెంకటాపురం మండలాలకు సైతం రవాణా స్తంభిస్తోంది. ఇక రెండో ప్రమాద హెచ్చరిక జారీతో ఏపీలోని కూనవరం, వీఆర్‌పురంతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు వాహనాలు తిరగడం లేదు. పంటలను సైతం వరద ముంచెత్తుతుండగా రెండోసారి పంటలు వేసేందుకు రైతులకు అదను దాటిపోతోంది. వరదల ప్రభావంతో పత్తి, మిరప, వరి దిగుబడి తగ్గుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

సూపర్‌బజార్(కొత్తగూడెం) : గోదావరి నీటి మట్టం హెచ్చుతగ్గులతో నమోదవుతున్న క్రమంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం 48 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీచేశామని పేర్కొన్నారు. ముంపు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని, ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, అత్యవసర సేవలకు కంట్రోల్ రూమ్ నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

తగ్గుతున్న తాలిపేరు

చర్ల: తాలిపేరు ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గుతోంది. పది రోజులుగా ఈ ప్రాజెక్టుకు వస్తున్న వరద నేపథ్యంలో అధికారులు 25 గేట్లను పూర్తిగా ఎత్తి 1.45 లక్షల క్యూసెక్కుల మేర వరద నీటిని దిగువకు విడుదల చేస్తుండడంతో నీటిమట్టం భారీగా తగ్గింది. దీంతో గురువారం 15 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే దిగువకు విడుదల చేశారు. కాగా, ఎగువ ప్రాంతాల్లోని వరదతో గోదావరి పెరుగుతుండగా తాలిపేరు, జోడిచీలికలవాగు, టపావాగు, ఊతవాగుల ద్వారా బ్యాక్ వాటర్ పలు గ్రామాల సమీపంలోకి చేరింది. తేగడలోని తాలిపేరు నది హైలెవల్ వంతెన వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. తేగడ, దేవరాపల్లి, కుదునూరు, దండుపేట, కొత్తపల్లి, గొంపల్లి, లింగాపురం తదితర గ్రామాల సమీపాల్లోకి గోదావరి వరద చేరడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొత్తపల్లి – దండుపేట గ్రామాల మధ్య ప్రధాన రహదారి నీటమునిగింది.

పర్యావరణ పరిరక్షణకు సింగరేణి కృషి
- సంస్థ నాటే మొక్కలు చిట్టడవిని తలపిస్తున్నాయి
- డీఎఫ్ఓ కృష్ణాగౌడ్



వనమహోత్సవంలో డీఎఫ్ఓ కృష్ణాగౌడ్, సింగరేణి అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ అటవీ భూముల్లో బొగ్గు ఉత్పత్తి తర్వాత నాటిన మొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయని, పర్యావరణ పరిరక్షణకు సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణాగౌడ్ అన్నారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకేఓసీ డంప్‌యార్డ్ ప్రాంతంలో గురువారం వన మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎఫ్ఓ మాట్లాడుతూ.. ప్రతి ఏటా మొక్కలు నాటటం, వాటిని సంరక్షించడంలో సింగరేణి అగ్రభాగాన ఉంటోందని అన్నారు. సింగరేణి డైరెక్టర్(పా) ఎన్వీకే శ్రీనివాస్ మాట్లాడుతూ తాము ఆరు శాతం బొగ్గు వెలికితీస్తే 20 శాతం మొక్కలు నాటుతున్నామని తెలిపారు. సీఎండీ ఎన్ బలరామ్ ఒక్కరే 16 వేల మొక్కలు నాటారని, దీంతో ఆయనకు ట్రీ మెన్ అవార్డు దక్కిందని గుర్తు చేశారు. ఏరియా జీఎం ఎం.శాలేంరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జి. వెంకటేశ్వరరెడ్డి, అటవీ శాఖ డివిజనల్ అధికారి కోటేశ్వరరావు, పర్యావరణ జీఎం జేవీఎల్ గణపతి, ఏజీఎం వివేక్‌బాబు, ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి, ఎఫ్ఆర్ఓ బి.ఉమ, అధికారులు హేనా సుమలత, బి.శివకేశవరావు, ఎం. రమేష్, తోట సత్యనారాయణ, ఎం. వెంకటేశ్వరరావు, హరినారాయణ, కె.శేషశ్రీ, ఎం.శ్రావణ్‌కుమార్, ఏరియా సెక్యూరిటీ అధికారి వి. శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు ఎండీ రజాక్, గట్టయ్య, రాములు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయిలో ప్రతిభ

- పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు బంగారు పతకాలు కైవసం



విజేతగా నిలిచిన రామ్మోహన్‌రావు

భద్రాచలంటౌన్: భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చూపాడు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగాల శ్రీనివాస్ రెడ్డి గురువారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 21 నుంచి 25 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు గాలి రామ్మోహన్‌రావు నాలుగు బంగారు పతకాలు సాధించాడు. పోటీల్లో భాగంగా బెంచ్ ప్రెస్, స్క్వాట్, డెడ్ లిఫ్ట్‌తోపాటు మూడు విభాగాల్లో కలిపి పవర్ లిఫ్టింగ్‌లో కూడా ప్రతిభ చాటి బంగారు పతకాలు గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావును పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లేష్, పట్టణ క్రీడా సంఘాలు, పలువురు రాజకీయ నాయకులు, గ్రీన్ భద్రాద్రి అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

రేపు జేఎల్ఎంల ఎంపిక పరీక్ష

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలకు చెందిన జూనియర్ లైన్‌మెన్ల ఎంపికకు ఈనెల 27న శనివారం ఖమ్మం విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ ఎ.సురేందర్ తెలిపారు. ఎన్పీడీసీఎల్ విడుదల చేసిన 9వ జాబితాలోని అభ్యర్థులకు ఈ పరీక్ష ఉంటుందని వెల్లడించారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహిస్తామని, ఇప్పటికే పోస్ట్ ద్వారా సమాచారం అందుకున్న అభ్యర్థులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

పాఠశాల నుంచి పారిపోయి..

ఇంటికి చేరిన విద్యార్థులు

దుమ్ముగూడెం : మండలంలోని ఆర్లగూడెం బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు గురువారం తెల్లవారు జామున పారిపోయారు. చర్ల మండలం పూసుగుప్పకు చెందిన విద్యార్థులు నూతనంగా ఆశ్రమ పాఠశాలలో చేరారు. ఇంటికి వెళ్లాలనే ఉద్దేశంతో ఎవరికీ చెప్పకుండా వెళిపోయారు. విషయం తెలుసుకున్న ఆశ్రమ పాఠశాల హెచ్ఎం, వార్డెన్‌లు గాలింపు చేపట్టగా విద్యార్థులు క్షేమంగా ఇంటికి చేరినట్లు తేలిసింది. రెండు రోజుల తర్వాత విద్యార్థులను హాస్టల్‌కు పంపిస్తామని తల్లిదండ్రులు తెలిపారని హెచ్ఎం, వార్డెన్ వివరించారు.

అనారోగ్యంతో ఐటీడీఏ పాలనాధికారి భీమ్ మృతి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న పెందూర్ భీమ్ అనారోగ్య సమస్యలతో గురువారం మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని బసవతారకం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. భీమ్ మృతి చెందడంతో ఏపీఓ డేవిడ్‌రాజ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

స్త్రీనిధి రుణాల సొమ్ము స్వాహా!

- గ్రామదీపిక చేతివాటంపై సభ్యుల ఫిర్యాదు

సుజాతనగర్: బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాల సొమ్ము చెల్లించకుండా మోసానికి పాల్పడ్డ గ్రామ దీపికపై జూలూరుపాడు మండలం కరివారిగూడెం గ్రామానికి చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు పోలీస్‌స్టేషన్‌లో, ఏపీజీవీబీ బ్యాంకులో గురువారం ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం.. కరివారిగూడెం గ్రామానికి చెందిన గరిడి దుర్గారావు గ్రామదీపికతో పాటుగా బ్యాంకు మిత్రగా పనిచేస్తున్నాడు. ఇతని పరిధిలో సుమారు 30 డ్వాక్రా సంఘాలున్నాయి. లింకేజీ, స్త్రీనిధి రుణాలు పొందినవారు తిరిగి చెల్లిస్తున్న సొమ్మును ప్రతి నెలా సుజాతనగర్‌లోని ఏపీజీవీబీ బ్యాంకులో జమచేయాల్సి ఉంది. కానీ జమ చేయడంలేదు. కొన్ని గ్రూపుల మహిళలు కొత్త రుణాల కోసం ఇటీవల బ్యాంకుకు రాగా.. ఈ విషయం వెలుగుచూసింది. అప్పు చెల్లించాలంటూ బ్యాంకు నుంచి కొందరికి నోటీసులు కూడా వచ్చాయి. దీంతో సభ్యుల నుంచి నగదు తీసుకున్న గ్రామదీపిక బ్యాంకులో చెల్లించలేదని తేలింది. గతంలో దుర్గారావు చేసిన మోసాన్ని తెలుపగా డబ్బులు కట్టిస్తామని బ్యాంకు సిబ్బంది ఒప్పందం కూడా చేశారని సభ్యులు పేర్కొంటున్నారు. సుమారు రూ.30 లక్షల నుంచి 40 లక్షల వరకు సభ్యుల సొమ్ము పక్కదారిపట్టినట్లు తెలుస్తోంది. దీంతో 8 గ్రూపుల సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేధింపుల కేసు నమోదు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం పోలీసులు గురువారం వేధింపుల కేసు నమోదు చేశారు. ఎస్ఐ గణేష కథనం ప్రకారం.. మండలంలోని రేగుబల్లి గ్రామానికి చెందిన బుల్ల భవానిని భర్త నవీన్, అత్త, మామ వేధిస్తున్నారు. దీంతో రెండేళ్ల నుంచి భవాని పుట్టింటి వద్ద ఉంటోంది. కాగా తనను పట్టించుకోకుండా భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని, తనను మానసికంగా వేధిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు.



గుమ్మడవల్లి పొలాల్లో ఉన్న రాళ్ల కుప్పలు



ఇసుక ర్యాంపును తలపిస్తున్న వరి పొలం

వరద ముంపులోనే పొలాలు

ఇంకా తేరుకోని 'పెదవాగు' రైతులు, బాధితులు

అశ్వారావుపేటరూరల్: వారం క్రితం కురిసిన భారీ వర్షంతో ఉగ్రరూపం దాల్చిన పెద్దవాగు వరద ముంపు ప్రభావం నుంచి రైతులు, బాధితులు ఇంకా తేరుకోలేదు. వారం రోజులుగా పంట లు వరద ముంపులోనే ఉండగా, గ్రామాల్లో బురద తొలగలేదు. గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాల్లో బురద నిలిచి ఉండగా దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు కంపు భరించలేక కొందరు అస్వస్థతకు గురయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి పొలాల్లో ఇసుక మేటలు వేయగా, ఎక్కడ చూసినా రాళ్ల కుప్పలే కనిపిస్తున్నాయి. పెద్దవాగు ప్రాజెక్టు తూర్పు దిక్కులో ఉన్న బచ్చువారిగూడెం చెరువు కట్టకు సైతం భారీ గండి పడగా దాని కింద ఉన్న పొలాలు నీట మునిగాయి. చెరువు కట్ట గండిని పూడ్చితే ఆయకట్టులో వరి, పత్తి సాగు చేసుకోవచ్చని రైతులు అంటున్నారు. ఈ మేరకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నష్టం అంచనాలు సిద్ధం..

పెద్దవాగు ప్రాజెక్టుకు గండ్లు, వరద ముంపుతో దెబ్బతిన్న పంటల నష్టం అంచనా సిద్ధమైంది. గుమ్మడవల్లి, బచ్చువారిగూడెం, కోయ రంగాపురం గ్రామాల్లో వరద ముంపుతో 391 ఎకరాల్లో ఇసుక మేటలు, రాళ్ల పేరుకుపోయినట్లు వ్యవసాయ శాఖ సర్వేలో గుర్తించగా, 150 ఎకరాల్లో వరి నారు కొట్టుకుపోయిందని నిర్ధారించారు. మరో 100 ఎకరాల్లో పత్తి, 50 ఎకరాల్లో పామాయిల్, నిమ్మ తోటలు నీట మునిగాయని ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేశారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందించినట్లు ఏడీఏ అఫ్జల్ బేగం తెలిపారు.

సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

ఆర్డీఓ దామోదర్‌రావు



పర్ణశాల వద్ద గోదావరి వరదను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

చర్ల/దుమ్ముగూడెం: గోదావరి వరదలు పెరుగుతున్న నేపథ్యంలో ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాలను గుర్తించి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు సూచించారు. గురువారం ఆయన దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని పలు ముంపు ప్రభావిత గ్రామాల్లో పర్యటించారు. గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం పాఠశాలలు, జూనియర్ కళాశాలతో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ కొత్తపల్లి, దండుపేట, గుంపెన్నగూడెం, సున్నం బట్టి, కాశీనగరం గ్రామాలు గోదావరి వరదల ముంపునకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తోందని అన్నారు. ముంపు ప్రభావిత గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. ప్రజలను జాగ్రత్తకు పునరావాస కేంద్రాలకు తీసుకెళ్లాలని ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి సూచించారు. పునరావాస కేంద్రాల్లో వరద బాధితులకు వైద్యంతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలన్నారు. ముంపు ప్రాంతాల్లో గర్భిణులు ఉంటే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం కమాండర్ భూపతి రావు, ఎంపీడీఓలు ముత్యాలరావు, ఈదయ్య, తహసీల్దార్లు శ్రీనివాస్, మణిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు మావోయిస్టుల లొంగుబాటు



వివరాలు వెల్లడిస్తున్న సుకుమా జిల్లా పోలీసులు

దుమ్ముగూడెం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్, ఏఎస్పీ నిఖిల్ రఖేచా ఎదుట గురువారం ఐదుగురు మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారు. ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నియ్యద్ నెల్ల నర్ పథకంతో ప్రభావితమై లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టులు దండకారణ్యంలో జరిగిన పలు విధ్వంసకర ఘటనలో నిందితులుగా ఉన్నారని, వారిలో ముగ్గురుపై రూ.5 లక్షల చొప్పున, ఇద్దరిపై రూ.2 లక్షల చొప్పున రివార్డు ఉందని పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువరైతు ఆత్మహత్య



మునగాల అశోక్ (ఫైల్)

అన్నపురెడ్డిపల్లి: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక యువ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అన్నపురెడ్డిపల్లి మండలం కట్టుగూడెంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మునగాల అశోక్ (33) గతేడాది పంటల పెట్టుబడికి అప్పు చేయగా ఆ భారానికి అనారోగ్య సమస్యలు తోడయ్యాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన అశోక్ ఈనెల 23న (మంగళవారం) పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. కాగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

పిచ్చి కుక్క కరిచి..

పలువురిని పొడిచిన గేదె



బాధితుడికి అంబులెన్స్‌లో చికిత్స చేస్తున్న సిబ్బంది

టేకులపల్లి: మండల కేంద్రంలో గురువారం పిచ్చి కుక్క కరిచిన గేదె అదే తరహాలో హల్‌చల్ చేసింది. అడ్డువచ్చిన వారినల్లా పొడిచి తీవ్ర గాయాలపాలు చేసింది. మండలంలోని బద్దుతండా గ్రామానికి చెందిన బాదావత్ హర్జ్య రెండు వారాల క్రితం ఆళ్లపల్లిలో ఓ గేదెను కొనుగోలు చేయగా, పది రోజుల క్రితం మేతకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కాగా ఆ గేదెను పిచ్చి కుక్క కరవడంతో మండల కేంద్రం చుట్టుపక్కల తిరుగుతూ గురువారం తడికలపూడి రోడ్‌లోని శ్మశాన వాటిక వద్దకు చేరింది. అక్కడి నుంచి అడ్డువచ్చిన వారినల్లా పొడిచింది. సక్రుతండా, భీంసింగ్ తండా, ఎ కాలనీతండా, వాగొడ్డుతండాలకు చెందిన రైతులపై దాడి చేసింది. దీంతో దారావత్ లక్ష్మా, గుగులోత్ నమ్కు, దారావత్ చందు, కోత్యా, లావుడ్యా దేవదాసు, గుగులోత్ రాధలకు గాయాలయ్యాయి. వీరిలో లక్ష్మా ముక్కు, చేతికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని 108 అంబులెన్స్ ద్వారా కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా సీఐ సీఐ తాటిపాముల సురేష్ ఆధ్వర్యంలో సిబ్బంది, రైతులు, స్థానిక యువకులు కలిసి గేదెను బంధించి పశువైద్యశాలకు తీసుకెళ్లి మత్తు మందు ఇప్పించారు. మెరుగైన చికిత్స అందించాలని యజమానికి అప్పగించారు.

విద్యుదాఘాతంతో మున్సిపల్ కార్మికుడికి గాయాలు

మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలింపు



కార్మికుడిని బైక్‌పై ఆస్పత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో ఎలక్ట్రికల్ విభాగంలో పని చేసే కార్మికుడు దుర్గాప్రసాద్ గురువారం విద్యుదాఘాతానికి గురయ్యాడు. రామవరం 12వ వార్డు ఏసీబీ నగర్‌లో మున్సిపల్ ఎలక్ట్రికల్ లైన్‌కు సంబంధించి విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దానికి సంబంధించిన విద్యుత్ తీగ దుర్గాప్రసాద్ ఎక్కిన పోల్‌పై పడటంతో విద్యుదాఘాతానికి గురై, స్తంభంపై నుంచి కిందపడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలు కాగా, స్థానికులు బైక్‌పై చికిత్స నిమిత్తం కొత్తగూడెం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్లారు.

పలువురి పరామర్శ

గాయపడ్డ కార్మికుడు దుర్గాప్రసాద్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్‌స్వామి, టీపీసీసీ సభ్యుడు నాగాసీతారాములు పరామర్శించారు. పరామర్శించినవారిలో కౌన్సిలర్ తలుగు అనిల్, నాయకులు కరీంపాషా, జయప్రకాష్, వెంకట్, ఉదయ్‌కుమార్ ఉన్నారు.

మద్యం మత్తులో కారు నడుపుతూ..

- ఆటోను ఢీకొట్టిన సింగరేణి కార్మికుడు
- తల్లీకూతుళ్లకు తీవ్రగాయాలు



నుజ్జునుజ్జయిన ఆటో

మణుగూరు టౌన్: సింగరేణి కార్మికుడు మద్యం మత్తులో కారు నడుపుకుంటూ వెళ్తూ ఆటోను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ మేడ ప్రసాద్ కథనం ప్రకారం.. విప్పలసింగారానికి చెందిన, సింగరేణి ఉద్యోగి బూర్గుల కృష్ణ గురువారం పీవీకాలనీలో జరిగే సంతకు మద్యం మత్తులో కారు నడుపుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో మణుగూరు మహాలక్ష్మి ఓబీ కంపెనీలో ఆపరేటర్‌గా పనిచేస్తున్న మట్టా నవీన్ తన సొంత ఆటోలో భార్య పూజిత, పది నెలల కూతురిని తీసుకుని పీవీకాలనీ పార్క్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కూనవరం పంచాయతీ సమీపంలో ఆటోను కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటో పల్టీలు కొడుతూ నిలిపి ఉంచిన మరో ఆటోను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో నవీన్ భార్యకు వెన్ను ముక భాగంలో, చిన్నారికి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 100 పడకల ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన కృష్ణ కారుతో సహా పరారయ్యాడు. ఎస్ఐ ప్రసాద్ సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా గాలింపు చేపట్టి కారును పట్టుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్ సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం పూజితను కొత్తగూడెం తరలించారు. తక్షణమే స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన స్థానికుడు దేవారెడ్డిని పలువురు అభినందించారు.

బీసీ హాస్టల్ విద్యార్థి అదృశ్యం



అదృశ్యమైన 8వ తరగతి విద్యార్థి తనీష్

ఇల్లెందు: బీసీ హాస్టల్‌లో ఉంటూ జవహర్ పబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి అదృశ్యంకాగా, గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. గార్ల మండలం చిన్న బంజరతండా గ్రామానికి చెందిన బానోతు తారాచంద్- పద్మ దంపతుల కుమారులు తనీష్ (8వ తరగతి), సిద్ధేశ్వర్(6వ తరగతి) ఇల్లెందు బీసీ హాస్టల్‌లో ఉంటూ జవహర్ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్నారు. గత నెల 24న వారు పాఠశాలలో చేరారు. పాఠశాలలో చేరాక ఇంటికెళ్లినవారిని బుధవారం ఉదయం మేనమామ తీసుకొచ్చి హాస్టల్‌లో అప్పగించాడు. తనకు విరేచనాలు అవుతున్నాయంటూ తమ్ముడితో చెప్పిన తనీష్ ఆలస్యంగా పాఠశాల వద్దకు వెళ్లి పుస్తకాల బ్యాగ్ అక్కడ పెట్టి, అదృశ్యమయ్యాడు. సాయంత్రం వరకు పాఠశాలకు రాకపోవడంతో తోటి విద్యార్థులు వార్డెన్ రవికి, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారువచ్చి పలుచోట్ల వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం పోలీసులు కూడా విద్యార్థి కోసం గాలించారు. జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి ఇందిర హాస్టల్‌ను సందర్శించి వాకబు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు. ఇల్లెందు బస్టాండ్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించడంతోపాటు బయ్యారం, గార్ల, డోర్నకల్, వరంగల్, హైదరాబాద్‌లలో ప్రత్యేక పోలీసు బృందాలచే సోదాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా విద్యార్థి అదృశ్యంపై పాఠశాల యాజమాన్యం పట్టించుకోవడం లేదు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

దమ్మపేట: మండల పరిధిలోని గున్నేపల్లి అటవీ ప్రాంతంలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం...రహదారి పక్కనే అటవీ ప్రాంతంలో కుళ్లిపోయిన మృతదేహం ఉన్నట్లు స్థానికుల ద్వారా తెలుసుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి అనంత్‌కుమార్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్సై సిబ్బందితో వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలోఉండగా, ఆ ప్రదేశంలోనే పోలీసుల సమక్షంలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి వయసు 40 ఏళ్లు ఉండవచ్చని, 15 నుంచి 20 రోజుల కిందట చనిపోయి ఉంటాడని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న భర్త, అతని కుటుంబీకులపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ముస్లిం బజారుకు చెందిన ఎస్‌కే జరీనా బేగంతో పాల్వంచలోని ఒడ్డుగూడేనికి చెందిన నయీమ్‌తో 22 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు సంతానం ఉన్నారు. కాగా, గడిచిన కొంత కాలంగా జరీనా బేగంను భర్తతోపాటు, మామయ్య జానీమియా, సోదరుడు రహీమ్, ఆడపడుచు రిహానా, ఆమె భర్త ఖలీమ్ కలిసి అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏజెన్సీలో అలజడి

- ఎన్‌కౌంటర్‌తో ఉలిక్కి పడిన దామరతోగు పరిసర పల్లెలు

ఇల్లెందు/గుండాల: ఉమ్మడి ఖమ్మం-వరంగల్ జిల్లాల సరిహద్దు దామరతోగు అటవీ ప్రాంతం కరెద్దుగండి గుట్టల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌తో ఇల్లెందు ఏజెన్సీలో అలజడి నెలకొంది. మావోయిస్టు దళ సభ్యుడు, భూపాలపల్లి జిల్లా ఘనపురం మండలం బుద్ధారం గ్రామానికి చెందిన నల్లమారి అశోక్ అలియాస్ విజేందర్ మృతి చెందాడు. దీంతో కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో ఎన్‌కౌంటర్‌తో మళ్లీ భయాందోళనలు నెలకొన్నాయి.

టీంల సంచారంతోనే..

మావోయిస్టు దళాలు, ప్లాటూన్లు, గెరిల్లా ఆర్మీకు చెందిన టీంలు జూన్ నెల నుంచి తెలంగాణలో సంచరిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ తరుణంలో వారం రోజులుగా ములుగు, ఏటూరునాగారం, వరంగల్, మణుగూరు పోలీసులు ముమ్మరంగా గాలింపు చేపట్టారు. ప్రత్యేక పోలీసు బలగాలతో కూంబింగ్ చేపట్టారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పోలీసులు వివిధ రకాలుగా వాగులు, రోడ్ డ్యాంల పరిశీలనల పేరుతో మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలతో మమేకం అవుతూ నిఘా పెడుతున్నారు.

మూడేళ్ల తర్వాత..

గుండాల మండలం దేవాళ్లగూడెం- దుబ్బగూడెం రోడ్‌లో 2020 సెప్టెంబర్ 3న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్ర నేత హరిభూషణ్ గన్‌మెన్ దేవాలు మృతి చెందాడు. 2019 జూలై 31న రోళ్లగడ్డ పందిగుట్ట వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో న్యూడెమోక్రసీ దళ నేత లింగన్న మృతి చెందాడు. 2019 ఆగస్టు 21న మణుగూరు మండలం బుడుగుల అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో గుండాల మండలం దామరతోగుకు చెందిన జాడి వీరస్వామి అలియాస్ రఘు మృతి చెందాడు. 2020 జూలై 15న మణుగూరు మండలంలో మల్లెతోగు అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు, పోలీసులుకు ఎదురు కాల్పులు జరిగాయి. 2012 ఫిబ్రవరిలో గుండాల మండలం కొమ్ముగూడెం వద్ద జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు దళనేత సింగన్న మృతి చెందాడు. మూడేళ్ల తర్వాత తాజాగా దామరతోగు అటవీప్రాంతంలో మావోయిస్టు అశోక్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు.

ఆయిల్ పామ్ సాగు విస్తరింపజేస్తాం..



మంత్రి తుమ్మల వ్యవసాయ క్షేత్రంలో పరిశీలిస్తున్న చైర్మన్ రాఘవరెడ్డి, అధికారులు

దమ్మపేట: రాష్ట్రమంతటా ఆసక్తి ఉన్న రైతులు ఆయిల్ పామ్ పంట సాగు చేసేలా విస్తృతంగా అవగాహన కల్పిస్తామని టీఎస్ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి వెల్లడించారు. దమ్మపేట మండలం గండుగులపల్లి, లింగాలపల్లిల్లోని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు చెందిన ఆయిల్ పామ్ క్షేత్రాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయిల్ పామ్ తోటల పెంపకం, దిగుబడి తదితర వివరాలు ఆరా తీశారు. మండలంలో ఆయిల్ పామ్ మొక్కల ఎదుగుదల, దిగుబడి ఆశాజనకంగా ఉండడమే కాక అంతర పంటల సాగు కూడా ఆశాజనకంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ ప్రాంత రైతుల అనుభవాలను రాష్ట్రంలోని ఇతర జిల్లాల రైతులకు తెలియజేసి ఆయిల్ పామ్ చేసేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. పామాయిల్ వినియోగంతో పోలిస్తే ఉత్పత్తి తక్కువగా ఉన్న కారణంగా పంట సాగు చేసే రైతులకు నష్టమనేదే రాదని చెప్పారు. కాగా, ఆయిల్ ఫెడ్ అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సహకారం అందించాలని సూచించారు. కాగా, చెట్ల మొగిలో తెగుళ్ల ఆశించిన నేపథ్యాన కారణాలు తెలుసుకుని నివారణపై రైతులకు సూచనలు చేయాలని చైర్మన్ రాఘవరెడ్డి తెలిపారు. తొలుత గొర్రెగుట్టలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో చైర్మన్ పూజలు చేశారు. ఈకార్యక్రమంలో జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, రిసోర్స్ ట్రెనింగ్ అధికారి రాజశేఖరరెడ్డి, ఫ్యాక్టరీ మేనేజర్లు కళ్యాణ్, బాలకృష్ణ, నాగబాబు రైతులు కాసాని నాగప్రసాద్, చీమకుర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
ఫ్యామిలీ
IV
ఖమ్మం
శుక్రవారం ॥ 26-7-2024

ఫ్యాషన్




గ్రామీణ మహిళా కళాకారులను ప్రోత్సహించడానికి, వారి వారసత్వ కళను, ఫ్యాబ్రిక్ క్రాఫ్ట్‌ను భారతదేశం అంతటా పరిచయం చేయడానికి ది వోవెన్ ల్యాబ్ పేరుతో కృషి చేస్తున్నారు భూపాల్ వాసి **నిఖితా కౌశిక్.** ముంబైలోని నిఫ్ట్ పూర్వవిద్యార్థి అయిన నిఖిత జీరోవేస్ట్ పాలసీతో పాతికమంది గ్రామీణ మహిళల చేత పట్టణ మహిళల కోసం ఆధునికంగా డ్రెస్‌లను డిజైన్ చేయించి, వారికి ఉపాధి కల్పిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'స్టైల్ తత్త్వ' ఎగ్జిబిషన్‌లో క్రాఫ్ట్స్, హ్యాండ్లూమ్ క్లస్టర్స్‌కి వారధిగా ఉంటూ చేస్తున్న కృషిని వివరించారు.

సిటీకి పల్లె కళ

''ఈ రోజు మనం భారతీయులమని చెప్పుకోవడానికి గర్విస్తున్నామంటే మన దేశంలోని విభిన్న సంస్కృతులూ, సంప్రదాయాలూ కారణం. వేటికవి సొంత మార్గాలలో ప్రత్యేకమైనవి. ఫలితంగా మన జీవితంలో దుస్తులు ముఖ్యమైన అంశంగా మారాయి. మన గ్రామీణ మహిళా కళాకారుల హస్తకళ శిల్ప నైపుణ్యాన్ని చేతితో నేసిన వస్త్రాలను మరింత మెరుగుపరచడంలో మా పని కీలకంగా ఉంటుంది. చిట్ట చివరగా ఉపయోగించే చిన్న ఫ్యాబ్రిక్ పీస్‌తో కూడా 'కళ'ద్వారా అందంగా డిజైన్ చేస్తాం. ఇందుకోసం నిరంతరం పరిశోధన జరుగుతూనే ఉంటుంది. అందుకే, మా బ్రాండ్‌కు 'ది వోవెన్ ల్యాబ్' అని పేరు పెట్టాం.



నిఖితా కౌశిక్

జీరో వేస్ట్ పాలసీ

రాజస్థాన్, గుజరాత్ భోపాల్.. ప్రాంతాల్లోని గ్రామీణ, గిరిజన మహిళల చేతుల్లో రూపుదిద్దుకున్న మా దుస్తుల డిజైన్స్ బయట షాపుల్లో లభించవు. ఎగ్జిబిషన్లు, ఆన్‌లైన్ ద్వారా అమ్మకం చేస్తుంటాం. మన దేశీ కాలా పత్తితో పాటు టెన్సెల్, రీసైకిల్ ఫ్యాబ్రిక్స్, పర్యావరణ అనుకూలమైన క్లాత్‌తోనే డిజైన్ చేస్తున్నాం. అరుదైన కాటన్ ఫ్యాబ్రిక్, ప్రాచీన కళా వైభవం గల మోడర్న్ డిజైనరీ డ్రెస్సులు కాబట్టే వీటి ఖర్చు ఎక్కువే. కానీ, ఎక్కడ ఉన్నా ప్రత్యేకతను చాటుతుంటాయి.

మహిళా సాధికారత

మా సంస్థకు ఉన్న బలమైన స్తంభాలలో ఒకటి మహిళా సాధికారత. ఇప్పటికి పాతిక మంది గ్రామీణ మహిళలు ఈ డిజైన్స్ కోసం కృషి చేస్తున్నారు. కళ పట్ల ఆసక్తి ఉన్న గ్రామీణ బాలికలను ఎంపిక చేసుకొని, శిక్షణ ఇవ్వడమే కాకుండా, వారి ప్రాథమిక విద్య కూడా సవ్యంగా జరిగేలా చూస్తున్నాం. ఒక డ్రెస్ కొనుగోలు చేస్తే ఆ మొత్తంతో ఆ కళాకారుల ఇల్లు నెలంతా ఏ ఇబ్బంది లేకుండా గడిచిపోతుంది. భవిష్యత్తు తరాలు ఆ కళావైభవాన్ని సొంతం చేసుకోవాలన్నదే నా కల. చాలావరకు సేకరించే కాటన్ ఫ్యాబ్రిక్ ఐవరీ, గ్రే కలర్ వే ఎంచుకుంటాం. కొన్నింటికి మాత్రం నేచురల్ రంగులతో డైయింగ్ ప్రక్రియ ఉంటుంది. వ్యర్థాలను నివారిస్తూ, పర్యావరణ అనుకూలమైన ఉత్పత్తులను వెలుగులోకి తీసుకురావాలన్నదే మా ప్రయత్నం తప్ప ఫాస్ట్ ఫ్యాషన్ పోటీ పరుగులో చేరం.

రాబోయే తరాలకు మన కళ

ప్రాచీన హ్యాండ్ వర్క్స్‌ని వదిలేస్తే అవి అంతే సులువుగా మరుగున పడిపోతాయి. క్రాఫ్ట్స్ క్లస్టర్స్ ఆఫ్ ఇండియాతో అనుబంధంగా వర్క్ చేస్తున్నాను కాబట్టి దేశంలోని హ్యాండ్లూమ్ క్లస్టర్స్ తోనూ, ఈ మార్గంలో వచ్చే అంతరాలను పూడ్చేందుకు నిఫ్ట్‌లోని వివిధ కేంద్రాలతో అనుబంధంగా వర్క్ చేస్తున్నాను.

ఫ్యాబ్రిక్ సేకరణ, డిజైన్స్ సృష్టి, వ్యర్థాలు మిగలకుండా జాగ్రత్తపడటం అనేది ఓ సవాల్‌గా ఉంటుంది. కానీ, పర్యావరణ హితంగా, మనసుకు నచ్చిన పని చేస్తుండటం ఎప్పుడూ ఉత్సాహాన్ని ఇస్తుంది. అంతేకాదు, ఈ డిజైన్స్‌ని ఇష్టపడి కొనుగోలు చేసేవారి ద్వారా ప్రాణం పెట్టే కళాకారులకు ఉపాధి పొందేలా చేయడం మరింత సంతృప్తిని ఇస్తుంది'' అని వివరించారు ఈ డిజైనర్.

- నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

పాలక్... పన్నీరు

మనసున్న పాట

పాలక్ ముచ్చల్ అనే పేరు వినిపించగానే తీయటి పాట ఒకటి గుర్తొస్తుంది సింగర్‌గా మంచి పేరు తెచ్చుకున్న పాలక్ సామాజిక సేవలోనూ తన వంతుగా కృషి చేస్తోంది. ఫండింగ్ ద్వారా ఇప్పటి వరకు మూడు వేల మంది పేద పిల్లలకు గుండె ఆపరేషన్‌లు చేయించింది.



బాలీవుడ్ సినిమా 'ఎంఎస్ దోని–ది అన్ టోల్డ్ స్టోరీ'లోని 'కౌన్ తుఝే' పాటతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది పాలక్. ఇండోర్‌కు చెందిన పాలక్‌కు కాలేజీ రోజుల నుంచి పాటతో పాటు సేవా బాటలో పయనించడం అంటే కూడా ఇష్టం.

పాలక్ తొలి ఫండ్ రైజింగ్ ప్రాజెక్ట్ కార్గిల్ వీర సైనికుల కోసం చేసింది. ప్రతి షాప్ ముందుకు వెళ్లి దేశభక్తి గీతాలు పాడి 'కార్గిల్ వీర సైనికులకు మీ వంతుగా సహాయం చేయండి' అని అడిగేది.

కళ, సామాజిక సేవను పాలక్ వేరు చేసి చూడదు. మూడు వేల మంది పేద పిల్లలకు గుండె ఆపరేషన్‌లు చేయించడానికి తనలోని కళ బలమైన మాధ్యమంగా ఉపయోగపడుతుందని చెబుతుంది పాలక్.

సినిమాల్లో అవకాశాలు దొరకని రోజుల్లో కూడా ఎన్నో ప్రోగ్రామ్స్ చేసి పేద పిల్లల కోసం విరాళాలు సేకరించేది.

పాలక్ ఒక మ్యూజిక్ ప్రోగ్రామ్ చేసిందంటే పది మంది పేద పిల్లల వైద్యానికి అవసరమైన డబ్బును సేకరించినట్లే. బాలీవుడ్‌లో సింగర్‌గా పాలక్‌కు మంచి పేరు రావడమే కాదు ఆ పేరు విరాళాల సేకరణకు బాగా ఉపయోగపడింది.

'మీ పాట అద్భుతం' అనే ప్రశంస కంటే, పేదింటి తల్లిదండ్రుల గొంతు నుంచి వినిపించే...

'మీ వల్ల మా బిడ్డ బతికింది' అనే మాట పాలక్‌కు ఎక్కువ సంతృప్తి ఇస్తుంది. ఇప్పుడు పాలక్ వెయిటింగ్ లిస్ట్‌లో 413 మంది పిల్లలు ఉన్నారు. వారికి హార్ట్ సర్జరీలు చేయించాల్సిన బాధ్యతను భుజాలకెత్తుకుంది.

'మనస్ఫూర్తిగా కోరుకుంటే అంతా మంచే జరుగుతుంది. పేదపిల్లలకు అండగా నిలవడానికి ఇది దేవుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తాను' అంటుంది పాలక్ ముచ్చల్.

వంటిల్లు

ఇది పకోడీ కాలం

ఇది వర్షాకాలం. వాన చినుకులు పడుతుంటే... వేడి వేడి పకోడీలు తింటూ గరం గరం చాయ్ తాగుతూ ఉంటే ఎలా ఉంటుంది? ఏడాదంతా వర్షాకాలమే ఉంటే బావున్ననిపిస్తుంది. ఇది వర్షాకాలం కాదు పకోడీల కాలం అనాలనిపిస్తుంది.



పోహా పకోడీ

కావలసినవి: అటుకులు– ఒకటిన్నర కప్పులు; బంగాళాదుంప– అర కప్పు (ఉడికించి చిదిమినది); కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు; పచ్చిమిర్చి తరుగు– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; చక్కెర – అర టీ స్పూన్; నిమ్మరసం – అర టీ స్పూన్; జీలకర్ర– అర టీ స్పూన్; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె– వేయించడానికి తగినంత.

తయారీ: ● అటుకులను ఒక పాత్రలో వేసి (అటుకులు తేలేటట్లు) నిండుగా నీటిని పోసి కడిగి వడపోత గిన్నెలో వేయాలి ● నీరంతా కారిపోయిన తర్వాత తీసి వెడల్పు పాత్రలో వేసుకోవాలి. అందులో ఉడికించి చిదిమిన బంగాళాదుంప, కొత్తిమీర, పచ్చిమిర్చి, మిరప్పొడి, చక్కెర, జీలకర్ర, నిమ్మరసం, ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం అంతటినీ చిన్న నిమ్మకాయంత గోళీలుగా చేసుకోవాలి ● బాణలిలో నూనె వేడి చేసి, మరుగుతున్న నూనెలోఒక్కో గోళీని మెల్లగా వేయాలి. మంటను మీడియంలో పెట్టి దోరగా వేగనివ్వాలి. అన్నివైపులా ఎర్రగా వేగిన తర్వాత చిల్లుల గరిటతో తీసి టిష్యూ పేపర్ మీద వేస్తే పోహా పకోడీ రెడీ. వీటికి పుదీన చట్నీ లేదా టొమాటో కెచప్ మంచి కాంబినేషన్.



కార్న్ పకోడీ



కావలసినవి: స్వీట్ కార్న్ గింజలు– 2 కప్పులు; అల్లం వెల్లుల్లి పేస్ట్ – 2 టీ స్పూన్‌లు; జీలకర్ర– అర టీ స్పూన్; శనగపిండి– 3 టేబుల్ స్పూన్‌లు; బియ్యప్పిండి– 3 టేబుల్ స్పూన్‌లు; గరం మసాలా – అర టీ స్పూన్; ఉల్లిపాయ – ఒకటి (తరగాలి); పచ్చిమిర్చి – 2 (తరగాలి); కరివేపాకు – 2 రెమ్మలు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పసుపు – పావు టీ స్పూన్; మిరప్పొడి– అర టీ స్పూన్; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● మొక్కజొన్న గింజలను కడిగి చిల్లుల పాత్రలో వేసి నీరు పోయే వరకు ఉంచాలి ● ఈ లోపు ఒక పాత్రలో నూనె మినహా పైన తీసుకున్నవన్నీ వేసి కలపాలి ● మొక్కజొన్న గింజల్లో గుప్పెడు గింజలను తీసి పక్కన పెట్టి మిగిలిన గింజలను మిక్సీలో కచ్చపచ్చాగా గ్రైండ్ చేయాలి. ఇప్పుడు పక్కన పెట్టిన గింజలను కూడా శనగపిండి మిశ్రమంలో వేసి కలపాలి ● బాణలిలో నూనె మరిగించి పకోడీ మిశ్రమాన్ని చేతిలోకి తీసుకుని వేళ్లతో కొద్దికొద్దిగా నూనెలో వేయాలి. దోరగా వేగిన తర్వాత తీసి టిష్యూ పేపర్ మీద వేస్తే వేడి వేడి కార్న్ పకోడీలు తినడానికి రెడీ. ఇలాగే పిండినంతటినీ చేసుకోవాలి.

సినిమా

మహేశ్‌బాబు గోల్డ్?



హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లోని సినిమా అంతర్జాతీయ స్థాయిలో రూపొందనున్న సంగతి తెలిసిందే. దీంతో ఈ సినిమా ప్రతి అప్‌డేట్ ప్రపంచవ్యాప్త సినీ ప్రేమికులకు ఆసక్తికరంగా అనిపిస్తోంది. తాజాగా ఈ సినిమాకు 'గోల్డ్' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో బలంగా వినిపిస్తోంది. గతంలో 'మహారాజా', 'మహారాజ్' వంటి పేర్లు తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. లేటెస్ట్‌గా 'గోల్డ్' టైటిల్ వినిపిస్తోంది. ఆఫ్రికన్ ఫారెస్ట్ అడ్వెంచరస్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమా ప్రధాన కథాంశం ఓ నిధి వేట అనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఇప్పుడు ఈ సినిమాకు 'గోల్డ్' అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నారనే వార్త రావడంతో నిధి నేపథ్యం కాబట్టి ఈ టైటిల్‌నే ఖరారు చేస్తారనే చర్చ జరుగుతోంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్‌ను రచయిత విజయేంద్ర ప్రసాద్ పూర్తి చేశారని, హైదరాబాద్‌లో సెట్ వర్క్ జరుగుతోందని, జర్మనీలో కొంత చిత్రీకరణను ప్లాన్ చేశారని తెలుస్తోంది. షూటింగ్‌ను ఈ ఏడాదిలోనే ప్రారంభించాలనుకుంటున్నారు మేకర్స్.

పాఠాలు నేర్పినవారందరికీ ధన్యవాదాలు



● శ్రుతీహాసన్

హీరోయిన్‌గా పదిహేనేళ్ల విజయవంతమైన కెరీర్‌ని పూర్తి చేసుకుంటూ, ఇంకా అగ్ర శ్రేణి హీరోయిన్ల జాబితాలో ఒకరిగా రాణిస్తుండటం అంటే అంత సులభమైన విషయం కాదు. ఈ లిస్ట్‌లో చాలా తక్కువమంది హీరోయిన్లు ఉంటారు. తాజాగా శ్రుతీహాసన్ పేరు ఈ లిస్ట్‌లో చేరింది. తండ్రి కమల్‌హాసన్ నటించిన ద్విభాషా (తమిళం, హిందీ) చిత్రం 'హే రామ్' (2000)లో చైల్డ్ ఆర్టిస్టుగా తొలిసారి స్క్రీన్‌పై కనిపించారు శ్రుతీహాసన్. చైల్డ్ ఆర్టిస్టుగా మరో సినిమా చేయలేదు కానీ.. 'హే రామ్' రిలీజైన తొమ్మిదేళ్లకు హిందీ చిత్రం 'లక్' (2009)తో కథానాయికగా కెరీర్‌ను ఆరంభించారు శ్రుతి. ఆ తర్వాత సూర్య 'సెవెన్త్ సెన్స్', ధనుష్ 'త్రీ', రామ్ చరణ్ 'ఎవడు', అల్లు అర్జున్ 'రేసుగుర్రం' రవితేజ 'క్రాక్' .. ఇటీవల చిరంజీవి 'వాల్తేరు వీరయ్య', ప్రభాస్ 'సలార్: సీజ్‌ఫైర్' వంటి చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించారు శ్రుతి. నటిగా–గాయనిగా–సంగీత దర్శకురాలిగా... ఇలా మల్టీ టాలెంట్‌తో దూసుకెళుతున్నారు శ్రుతీహాసన్. కథానాయికగా పదిహేనేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రుతీహాసన్ స్పందిస్తూ – ''అప్పుడే పదిహేనేళ్లు పూర్తయ్యాయంటే నమ్మశక్యంగా లేదు. నేను పెరిగిన మ్యాజికల్ ఇండస్ట్రీలోనే ఇంతకాలం నేను ఉన్నందుకు చాలా సంతోషంగా ఉంది. నా మిగతా జీవితాన్ని కూడా ఇండస్ట్రీతోనే ముడివేస్తాను. ఇండస్ట్రీలో నాకు అందమైన పాఠాలు నేర్పినవారందరికీ ధన్యవాదాలు. అలాగే నన్ను ఆదరించిన ప్రేక్షకులు, నా అభిమానులకు థ్యాంక్స్. వీళ్లే లేకపోతే నేను ఇలా ఉండేదాన్ని కాదు'' అన్నారు. రజనీకాంత్ 'కూలీ', ప్రభాస్ 'సలార్: శౌర్యంగాపర్వం', అడవి శేష్ 'డెకాయిట్' చిత్రాల్లో నటిస్తున్నారు శ్రుతీహాసన్.

తనికెళ్ల భరణికి డాక్టరేట్



ప్రముఖ నటుడు, రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణికి వరంగల్ ఎస్ఆర్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. తనికెళ్ల భరణి దాదాపు 800లకు పైగా సినిమాల్లో నటించి ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 52 సినిమాలకు మాటలు అందించారాయన. 'సముద్రం' సినిమాకి ఉత్తమ విలన్‌గా, 'నువ్వు నేను' చిత్రానికి ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్టుగా, 'గ్రహణం' చిత్రంతో ఉత్తమ నటునిగా, 'మిథునం' సినిమాకిగాను ఉత్తమ రచయిత–ఉత్తమ దర్శకునిగా నంది అవార్డులు అందుకున్నారాయన. ఇక ఆగస్ట్ 3న వరంగల్‌లో జరిగే యూనివర్సిటీ స్నాతకోత్సవంలో తనికెళ్ల భరణికి డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు.

మళ్లీ తల్లి కాబోతున్నాను



'ఏం పిల్లో ఏం పిల్లడో', 'బావ', 'పాండవులు పాండవులు తుమ్మెద, రభస, బ్రహ్మోత్సవం' వంటి సినిమాల్లో నటించిన ప్రణీత తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే. ఇక వ్యక్తిగత విషయానికి వస్తే... 2021 మే 30న వ్యాపారవేత్త నితిన్ రాజుతో ప్రణీత వివాహం జరిగింది. 2022 జూన్‌లో ప్రణీత ఓ పాపకు జన్మనిచ్చారు. కొన్ని నెలలు సినిమాలకు విరామం తీసుకున్నాక ఆమె కన్నడలో చేసిన ఒక సినిమా, మలయాళంలో చేసిన ఒక సినిమా ఈ ఏడాది విడుదలయ్యాయి. కాగా తాను రెండోసారి తల్లి కాబోతున్నట్లు పేర్కొన్నారు. 'రౌండ్ 2.. ఇప్పటి వరకూ నేను వాడిన పాంట్స్ ఇక నాకు ఫిట్ కావు'' అంటూ బేబీ బంప్ ఉన్న ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు ప్రణీత.


● ప్రణీత

హారర్... థ్రిల్



● ప్రియా భవానీ శంకర్

అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన తమిళ చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. అజయ్ ఆర్. జ్ఞానముత్తు దర్శకత్వం వహించారు. విజయ సుబ్రహ్మణ్యన్, ఆర్.సి.రాజ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టులో విడుదల కానుంది. రాజ్ వర్మ ఎంటర్‌టైన్‌మెంట్– శ్రీ బాలాజీ ఫిలింస్ తెలుగులో విడుదల చేస్తున్నాయి. ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు రామ్ గోపాల్ వర్మ రిలీజ్ చేసి, 'ట్రైలర్ ఆసక్తిగా ఉంది. సినిమా హిట్టవ్వాలి' అన్నారు. కాగా అజయ్ ఆర్. జ్ఞానముత్తు దర్శకత్వంలో వచ్చిన 'డీమాంటీ కాలనీ'కి సీక్వెల్‌గా 'డీమాంటీ కాలనీ 2' రూపొందింది. ''హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ఇది. డీమాంటీ ఇంట్లో అనూహ్యమైన ఘటనలు జరుగుతుంటాయి. ఆ ఇంట్లో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు వెళ్లిన వారు చనిపోతుంటారు. ఇంతకీ ఆ ఇంట్లో ఉన్న ఆ శక్తి ఏంటి? చివరగా వెళ్లినవారు ఎలా ప్రాణాలు కాపాడుకున్నారు?' అనేది 'డీమాంటీ కాలనీ 2'లో ఆసక్తిగా ఉంటుంది'' అన్నారు మేకర్స్.



● రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా

తెగబడవేమీ...

రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా ఏఎస్ రవి కుమార్ చౌదరి దర్శకత్వం వహించిన చిత్రం 'తిరగబడరసామీ'. మల్కాపురం శివకుమార్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 2న రిలీజ్ కానుంది. తాజాగా ఈ చిత్రం టైటిల్ సాంగ్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. 'కత్తులు దిగనీ నెత్తురుతోని తడపర భూమి తెగబడవేమీ...' అంటూ సాగే ఈ పాటకి జేబీ సంగీతం అందించారు. సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించిన ఈ పాటని సాయి చరణ్, లోకేశ్వర్ ఈదర, చైతు సత్సంగి పాడారు. ''యూత్‌ని ఆకట్టుకునే రొమాన్స్‌తో పాటు ఫ్యామిలీని ఆకర్షించే సెంటిమెంట్, మాస్‌ని అలరించే హై ఓల్టేజ్ యాక్షన్ అంశాలతో 'తిరగబడర సామీ' రూపొందింది. టీజర్, ట్రైలర్, పాటలు సినిమాపై క్యూరియాసిటీని పెంచాయి'' అని చిత్రబృందం పేర్కొంది.

రక్షించండి!



● 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబ' పోస్టర్

తాప్సీ నటించిన రొమాంటిక్ థ్రిల్లర్ మూవీ 'హసీన్ దిల్‌రుబ' (2021) హిట్టయిన విషయం తెలిసిందే. విక్రాంత్ మెస్సీ మరో లీడ్ రోల్‌లో నటించిన ఈ సినిమాకు వినీల్ మాథ్యూ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబ' రూపొందింది. సీక్వెల్‌లోనూ తాప్సీ, విక్రాంత్ మెస్సీ లీడ్ రోల్స్‌లో నటించగా, వినీల్ మాథ్యూయే దర్శకత్వం వహించారు. ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'నాతో కలిసి నువ్వు సినిమాకు వస్తావా?' 'నన్ను రక్షించండి... నా భర్త నన్ను చంపబోతున్నాడు' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రం ఆగస్టు 9 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

సినిమా బాగుందని అంటారు



● మహేంద్రనాథ్

''సమాజంలోని ఒక అంశానికి వాణిజ్య అంశాలు జోడించి 'విరాజి' తీశాం. ఈ సినిమాలో మంచి కంటెంట్ ఉంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ బాగుందని అంటారనే నమ్మకం ఉంది'' అని నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల అన్నారు. వరుణ్ సందేశ్ హీరోగా నటించిన చిత్రం 'విరాజి'. ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా మహేంద్రనాథ్ మాట్లాడుతూ– ''వరలక్ష్మితో 'శబరి' సినిమా తర్వాత మా సంస్థలో నిర్మించిన రెండో చిత్రం 'విరాజి'. ఆద్యంత్ హర్ష చెప్పిన కథని అంతే బాగా తెరకెక్కించారు. వరుణ్ సందేశ్ అమెరికా నేపథ్యం ఉన్న వ్యక్తి. అతని డైలాగ్ డెలివరీ విధానం 'విరాజి'కి కలిసొచ్చింది. మా సినిమాని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ వాళ్లు నైజాంలో రిలీజ్ చేస్తున్నారు'' అన్నారు.

ఏమైందో మనసే...



● పవన్, సాహిబా

'మెరిసే మెరిసే' చిత్ర దర్శకుడు పవన్ కుమార్ కొత్తూరి హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. స్నేహా మాలవ్య, సాహిబా భాసిన్, వివియా సంత్ హీరోయిన్లుగా నటించారు. శ్రీ నీలకంఠ మహదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీపై రూపొందిన ఈ చిత్రం పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఆగస్ట్ 2న విడుదల కానుంది. కాగా 'ఏమైందో మనసే' అంటూ సాగే ఈ చిత్రంలోని రెండో పాటను రిలీజ్ చేశారు. ఈ పాటకు కార్తీక్ బి. కొడకండ్ల సంగీతం అందించారు. కృష్ణవేణి మల్లవజ్ఝల సాహిత్యం అందించగా, శక్తి శ్రీ గోపాలన్ పాడారు.